యువ వెలుగు

యువ వెలుగు - ప్రజల వెలుగు | PRGI:- TGTEL/26/A6429 | తెలుగు దిన పత్రిక

www.yuvavelugu.com | yuvaveluguepaper.com | yuvavelugu tv

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : పి.మహేష్ గౌడ్ సంపుటి : 1 సంచిక : 05 ఆదివారం, సెప్టెంబర్ 06, 2026 , పేజీలు - 04 వెల: 2/-

యువ వెలుగు

తెలుగు దిన పత్రికలో పని చేయుటకు

రిపోర్టర్లు కావలెను

మండలం | నియోజకవర్గం | జిల్లా

వారీగా రిపోర్టర్లు కావలెను

మీ ప్రాంతంలో జరిగే వార్తలను మా పత్రికలో ప్రచురించడానికి అవకాశం.

సంప్రదించవలసిన నెంబర్ 9908 502 602

4 రాష్ట్రాల్లో జనగణన

– ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 05 : కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముం దుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసిం ది. ఈ ఏడాది డిసెంబర్ 1న మిగతా2లో...

ఉక్రెయిన్‌పై దాడులకు విరామం..
పుతిన్ కీలక ఆదేశం

మాస్కో సెప్టెంబర్ 05 :రష్యా-ఉక్రెయిన్ మ ధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న యుద్ధంలో శనివారం నాడు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌పై మూడు రోజుల పాటు దాడులను నిలిపివేయాలని రష్యా సైన్యాన్ని

మిగతా2లో...

సీట్లు పెరిగితే
117 గెలుస్తాం

- ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం

● కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా? ● సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా ● సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు ● వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు ● ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు ● ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా? ● ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం ● నకిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ● వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం

హైదరాబాద్,సెప్టెంబర్05 : ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్?కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్ గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని మిగతా2లో...

'చెత్త సేకరణ'ను రాంకీకి
అప్పగించొద్దు

● ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి ● లేదంటే సీఎం ఇంటి ముందే 1000 ఆటోల చెత్త పోస్తాం : కల్వకుంట్ల కవిత

హైదరాబాద్,సెప్టెంబర్ 05 : చెత్త సేకరణ కాంట్రాక్టును రాంకీ సంస్థకు అప్పగించే యోచనను విరమించుకోవాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేకుంటే వెయ్యి స్వచ్ఛ ఆటోల చెత్తను సీఎం ఇంటి ముందు పోస్తామని ఆమె మిగతా2లో...

మూడు తరాల్ని
ముంచేశారు

దగ్గర్లోనే కాంగ్రెస్‌ను నిషేధిత జాబితాలో పెట్టే రోజులు

పాలిటెక్నిక్ భూములపై ప్రభుత్వం కన్ను..జీవో 97ను అసెంబ్లీలో ఎండగడతాం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

2ఏతో ప్రజల భూములను లాక్కునే కుట్ర

కేసీఆర్ ప్రభుత్వం బాటలో రేవంత్ కూడా..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

264 ఎకరాల్లో
భారీ ప్రాజెక్ట్...

హైదరాబాద్,సెప్టెంబర్ 05 : హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ డేటా సెంటర్ సామర్థ్యం మిగతా2లో...

దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి

గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం

దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సిఎం రేవంత్



ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, ఛైర్మన్

సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

మూడు తరాల్ని ముంచేశారు

కరీంనగర్,సెప్టెంబర్ 05 : 'కాంగ్రెస్ పార్టీనే నిషేధిత జాబితాలో పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.. ఒక్క మంత్రినే బర్తరఫ్ చేయడం కాదు.. ఆ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులొచ్చాయి' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చ కపోవడాన్ని నిరసిస్తూ.. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన 'యువ సమరభేరి' సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చి 100 రోజుల్లో అమలు చేస్తామని డైలాగులు కొట్టి వెయ్యి రోజులు దాటినా ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. బకాసురుల్లా మేస్తూ, కుంభకర్ణుల్లా పడుకుంటూ, పందికొక్కుల్లా తింటూ పాలనను గాలికి వదిలేశారన్నా రు. 'ఇన్ని రోజులుగా యువతను మోసం చేసిన ధోకేబాజ్ రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి. పేదల భూములను నిషేధిత జాబితాలో పెడుతున్న కాంగ్రెస్‌ను రాబోయే రోజుల్లో ప్రజలే నిషేధిత జాబితాలో పెట్టడం ఖాయం' అని అన్నారు. **పాలిటెక్నిక్ భూములపై కాంగ్రెస్ కన్ను..**సిరిసిల్ల, వేములవాడ (అగ్రహారం) పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులను కలిసి కేటీఆర్ మాట్లాడారు. జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు బీఆర్ఎస్ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశా లలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 97 వెనుక పెద్ద కుట్ర ఉందన్నా రు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్, సిరిసిల్ల, కరీంనగర్‌లోని విలువైన పాలిటెక్నిక్ భూములు, ఆస్తులను ఇతర అవసరాలకు మళ్లించేందుకే ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. జీవో 97ను రద్దు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులపై కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ పర్యటనలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితర నాయకులు పాల్గొన్నారు. **అలుగునూరులో తృటిలో తప్పిన ప్రమాదం** కేటీఆర్‌కు కరీంనగర్ శివారులోని అలుగునూరు చౌరస్తా వద్ద మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భారీ క్రేన్‌తో గజమాల వేసి సన్మానించాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు కేటీఆర్‌కు పోటీపడి చేతినిండా రాఖీలు కట్టారు. కేటీఆర్ కారు వెనుక డోర్ తెరిచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సమయంలో పక్క నుంచి వెళ్తున్న ఓ లారీ ఢీకొట్టడంతో కారు డోర్ స్వల్పంగా దెబ్బతిన్నది.

264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

(మొదటి పేజీ తరువాయి)

గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది.టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి.దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణా రావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

హైదరాబాద్,సెప్టెంబర్ 05 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం

తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

4 రాష్ట్రాల్లో జనగణన

(మొదటి పేజీ తరువాయి)

జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (RGI – రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించ నున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఉక్రెయిన్‌పై దాడులకు విరామం.. పుతిన్ కీలక ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. యుద్ధం ముగింపు కోసం చర్చలు జరిపే ఉద్దేశంతో అమెరికా ప్రత్యేక ప్రతినిధిలు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు మాస్కో చేరుకోవడంతో పుతిన్ తాజా ఆదేశాలిచ్చారు.

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు కొత్త, స్పష్టమైన ప్రతిపాదన తన వద్ద ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చెప్పిన మరుసటి రోజే అమెరికా ప్రత్యేక ప్రతినిధుల మాస్కో పర్యటన చోటుచేసుకుంది.కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం చర్చల వేళ దాడులు చేసుకోవద్దని శుక్రవారంనాడు రష్యాకు ప్రతిపాదించారు. తమ వైపు నుంచి ఎలాంటి దాడులు ఉండవని, ప్రత్యర్థి నుంచి కూడా ఇదే ఆశిస్తున్నామని చెప్పారు. ఉక్రెయిన్, రష్యా మధ్య వైమానిక దాడులు పెరిగిన సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు జరుగుతుండటం విశేషం. శుక్రవారం కీవ్‌లోన ఉక్రెయిన్ భద్రతా సంస్థ ఎస్‌బీయూ ప్రధాన కార్యాలయంపై రష్యా డ్రోన్ దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత జరిగిన అత్యంత ప్రముఖ దాడుల్లో ఇది ఒకటిగా చెబుతున్నారు. రాత్రికి రాత్రి 167 డ్రోన్లను రష్యా ప్రయోగించినట్టు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది.

ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్ 05 : సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసన మండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు.సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతా వరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, ఛైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారో కోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు.సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు.

'చెత్త సేకరణ'ను రాంకీకి అప్పగించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆమె స్వచ్ఛ ఆటో కార్మికులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం రాంకీ సంస్థకు చెత్త సేకరణ బాధ్యతలు అప్పగిస్తోందని, ప్రాపర్టీ ట్యాక్స్ లో కలిపి చెత్త పైసలు వసూలు చేస్తే తమ ఉపాధి దెబ్బతింటుందని కార్మికులు ఆమెతో వాపోయారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, రాంకీ సంస్థకు లాభం చేయడానికి స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి పొందుతున్న వారిని రాంకీ సంస్థకు జీతగాళ్లుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. స్వయం ఉపాధి ద్వారా మంచి ఆదాయం పొందుతున్న వారికి నెలకు రూ.16 వేలు మాత్రమే జీతం ఇచ్చేలా రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని తప్పుపట్టారు. హైదరాబాద్ లో 20 వేల ఆటోల ద్వారా 40 వేల మంది స్వచ్ఛ ఆటో కార్మికులు ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. చెత్త సేకరణ యథావిధిగా కార్మికులతోనే చేయించాలని ఆమె డిమాండ్ చేశారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు ప్రభుత్వం రూ.20 లక్షల ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థ నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్ వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై సీఎం స్పష్టత నివ్వాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

హైదరాబాద్,సెప్టెంబర్ 05 :

సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

తెలంగాణ ప్రజలపై మరో భారం - కనీస ఆటో ఛార్జీ రూ.30కి పెంపు!

హైదరాబాద్ :రాష్ట్రంలో ఆటో ఛార్జీలను పెంచాలని అధికారుల కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రతిపాదిత రేట్ల ప్రకారం మొదటి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గానూ, ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14గానూ నిర్ణయించింది. అలాగే నిమిషానికి 75 పైసల వెయిటింగ్ ఛార్జీ, రాత్రివేళ ప్రయాణానికి సాధారణ ఛార్జీపై 50 శాతం అదనపు ఛార్జీ (సర్‌ ఛార్జీ)ని విధించాలని కమిటీ సూచించింది. ఈ సిఫార్సులతో కూడిన నివేదికను రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె.ఇలంబర్తి ఇటీవల ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన తర్వాత ఛార్జీల పెంపునకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ కానున్నాయి.ఛార్జీల సవరణ కమిటీ ఏం చెప్పిందంటే? : తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) 14 డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 7 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆగస్టు 23న జరిగిన సమావేశంలో 15 రోజుల్లోగా ప్రతిపాదనలు సమర్పిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు సమ్మె విరమించుకున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

సురేష్ రెడ్డి, ఎంవీఐ శ్రీనివాస్, ఏఎంవీఐలతో కూడిన బృందం తమ నివేదికను సమర్పించే ముందు కేరళ, ఢిల్లీ, కర్ణాటక (బెంగళూరు), మహారాష్ట్ర (ముంబయి)ల్లోని ఆటో ఛార్జీల విధానాలను అధ్యయనం చేసింది.12 ఏళ్లుగా ఛార్జీలు పెంచలేదు : ఇంధన ధరలు, బీమా, ఇతర నిర్వహణ ఖర్చుల వంటి వ్యయాల ఆధారంగానే ఛార్జీల పెంపు సిఫార్సు చేసినట్లు నివేదికలో కమిటీ పేర్కొంది. వాహన ధర రూ.2.55 లక్షలు, బ్యాంక్ రుణ సదుపాయం 70 శాతం, డ్రైవర్ నెలవారీ జీతం రూ.25 వేలు సగటున రోజువారీ ప్రయాణ దూరం 163.8 కి.మీ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఆదాయాన్ని ఆర్జించే ప్రతి కిలోమీటర్‌కు నిర్వహణ వ్యయం రూ.13.53గా ఉంది. దీనివల్ల కిలోమీటర్‌కు రూ.14 ఛార్జీని సిఫార్సు చేశారు. గత 12 ఏళ్లుగా ఆటో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, ఇప్పుడు వాటిని పెంచాల్సిన అవసరం ఉందని అధికారుల కమిటీ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది.ఆటో సంఘాల కార్మికుల ప్రధాన డిమాండ్లు ఈవీ ఆటోలను వెంటనే ఆర్టీసీ యాజమాన్యానికి అప్పగించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి.

ఆటో, రవాణా రంగ కార్మికుల కోసం సంక్షేమ మండలిని ఏర్పాటు చేయాలి.

ధరల పెరుగుదలకు ఆటో మీటర్ ఛార్జీలను పెంచాలి.ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి వాటికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఒక కొత్త యాప్‌ను తీసుకురావాలి.ఓలా,, ర్యాపి డోల ద్వారా అక్రమంగా నడుస్తున్న ద్విచక్ర వాహనాలపై నిషేధం విధించాలి.ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12,000 ఆర్థిక సహాయం అందించాలి. ఆటో డ్రైవర్లకు ఈ-చలాన్ జరిమానాల నుంచి మినహాయింపు ఇవ్వాలి.హైదరాబాద్ నగరంలో అక్రమంగా తిరుగుతున్న ఇతర జిల్లాల ఆటోలపై నిషేధం విధించాలి.వాహన్ సారథి పోర్టల్‌లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కేటగిరీని యథాతథంగా కొనసాగించాలి.జీవో నంబర్ 60 ప్రకారం రవాణా వాహనాలకు తప్పనిసరి చేసిన రేడియం స్టిక్కర్ల నిబంధన నుంచి ఆటోలకు మినహాయింపు ఇవ్వాలి.

ప్రజల ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తీసేయాల్సిందే

సంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 5: పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మెదక్ ఎంపీ రఘున oదన్ రావు హాజరయ్యారు. సింఫనీ పార్క్ హోమ్స్‌కు సంబంధించిన 15వందల ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ ప్రజల పక్షాన పోరాటం చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. పఠాన్‌చెరులో 55 ఎకరాల్లో ప్రభుత్వ శాఖల అనుమతులతో సింఫనీ హోమ్స్ నిర్మాణం జరిగిందని ఎంపీ తెలిపారు.రూపాయి రూపాయి కూడబెట్టి, లోన్లు తీసుకుని

నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చడం బాధాకరమని ఎంపీ అన్నారు. 12 ఏళ్ల క్రితం నిర్మాణం జరిగిన కాలనీని ఎలా నిషేధిత జాబితాలో చేరుస్తారని ప్రశ్నించారు. ఎవరు దరఖాస్తు చేశారని 22 ఏ జాబితా నుంచి రేవంత్ రెడ్డి ఇల్లు తొలగించారని నిలదీశారు. అదే తరహాలో ప్రజల ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తీసివేయాలని డిమాండ్ చేశారు. తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణ చెబితే సరిపోదని... జరిగిన తప్పును సరిదిద్దాలని సూచించారు. 22 ఏ జాబితాలో తప్పులకు బాధ్యులైన అధికారులను ప్రభుత్వం శిక్షించాలని ఎంపీ రఘునందన్ డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి వాహనంలో డీజిల్ అయిపోయింది'.. పోలీస్ జీపును తోసిన బీఆర్ఎస్ కార్యకర్తలు..

వికారాబాద్ జిల్లా :కాంగ్రెస్ 1000 రోజుల విఫలపాలనపై రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ విఫల పాలనను ప్రజలకు తెలియ జేయడంలో భాగంగా నిరసన తెలిపేం దుకు వెళ్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలో బీఆర్ఎస్ ధర్నాకు వెళ్తుండగా పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే పట్నం నరేందర్ రెడ్డిని తీసుకెళ్తున్న వాహనంలో సడెన్‌గా డీజిల్ అయిపోవడంతో అక్కడే నిలిచిపోయింది. దీంతో కాంగ్రెస్ సర్కార్ పాలనలో పోలీసుల పరిస్థితి ఎలా ఉందో చూడండి అంటూ బీఆర్ఎస్ శ్రేణులు తమదైన డైలాగ్స్ వర్షం కురిపించారు. సీఎం సొంత నియోజకవర్గంలో డీజిల్ లేదు.. రేవంత్ రెడ్డి వాహనంలో డీజిల్ అయిపోయింది.. రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో పోలీసుల బండ్లకే దిక్కులేదు.. ధొక్కు బండ్లు పట్టుకొస్తే రోడ్డు మొత్తం జామ్ అయింది.. ఓ గర్భిణీని అంబులెన్స్‌లో తీసుకువస్తుంటే ఈ పోలీసు వాహనం అడ్డగా ఉండటంతో ఎమర్జెన్సీ వెహికల్ నిలిచిపోయిందని ఓ కార్యకర్త చెబుతుండటం వీడియోలో చూడొచ్చు.బీఆర్ఎస్ కార్యకర్తలంతా కలిసి డీజిల్ లేక ఆగిపోయిన ఆ పోలీస్ వాహనాన్ని ముందు తోసి అంబులెన్స్ వెళ్లేందుకు మార్గం సుగమం చేశారు.

చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరి

హైదరాబాద్ :రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాసా నికి సంబంధించిన వ్యవస్థల పనితీరుకు సంబం ధించిన వివరాలపై హైకోర్టు ఆరా తీసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. 2 మాసాల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లుగా ఆరోపణలతోపాటు నమోదైన ఎఫ్ఐఆర్‌లో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ మేరకు డీఎన్ఏ శాంపిల్స్ సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలంటూ హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో వారంలోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది.ఇదీ కేసు నేపథ్యం : 2023లో దత్తత తీసుకున్న ఓ చిన్నరిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం.వెంకన్న దంపతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రూల్స్‌కు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ పిటిషన్‌ను

కొట్టివేయడంతో వెంకన్న అప్పీల్ చేశారు.ఈనెల 29కి విచారణ వాయిదా : ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయిలు వర్చువల్‌గా హాజరై సమాధానాలిచ్చారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించేందుకు సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డిని అమికస్ క్యూరీగా హైకోర్టు నియమిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.291 సంక్షేమ గృహాలున్నాయి : ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నలకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా సమాధానమిస్తూ అనాథలను గుర్తించి సాయం అందిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లో సీడబ్ల్యూసీ కమిటీలను 2 నెలల్లో పూర్తిచేస్తామని కోర్టుకు విన్నవించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 291 బాలల సంక్షేమ గృహాలుండగా, అందులో ప్రైవేటు ఆధ్వర్యంలో 231, ప్రభుత్వ ఆధ్వర్యంలో 60 నడుస్తున్నాయన్నారు. నేరాలకు పాల్పడిన, శిక్ష పడిన బాలల కోసం ప్రత్యేకంగా 35 సంరక్షణ కేంద్రాలున్నాయని శృతి ఓజా కోర్టుకు తెలిపారు.ప్రత్యేక దత్తత కేంద్రాలు 17 : అనాథలైన పిల్లల కోసం ప్రత్యేక దత్తత కేంద్రాలు 17 ఉన్నాయని శృతిఓజా వివరించారు. అనాథలుగా, ఎవరైనా అప్పగించడం ద్వారా దొరికిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచి, ప్రత్యేక దత్తత కేంద్రాల్లో ఉంచుతామన్నారు. నిబంధనల ప్రకారం సామాజిక దర్యాప్తు జరిపించి దత్తతకు అర్హులైనవారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామని ఆమె న్యాయస్థానానికి వివరించారు.పిల్లల సంక్షేమాన్ని శిశు సంక్షేమ శాఖ చూసుకుంటుందని, కేసుల్లో దర్యాప్తును మాత్రమే తాము చేపడతామంటూ హైకోర్టుకు శిఖాగోయల్ తెలిపారు. తమ శాఖలో ఎస్సీ, ఎస్టీ పిల్లల సంక్షేమాన్ని చూస్తామని విజయేందిర బోయి వివరించారు.

ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు

హైదరాబాద్ :ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్‌ఉపాధ్యాయు లు అర్హతలకలిగి అలమటిస్తున్నారని ఆవేదన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ఉపాధ్యాయుల కన్నీళ్లతో ఏ దేశం కానీ, రాష్ట్రం కానీ బాగుపడదని, ఈ పచ్చి నిజాన్ని కాంగ్రెస్ పాలకులు తక్షణమే గ్రహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అర్హతలతో అలమటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు



ఇవ్వకపోయినా ఓర్పుతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని కొనియా డారు. ఐదేనే సర్వస్వంగా భావించి కొవ్వొత్తిలా కరిగే ఐ రిటైర్డ్ టీచర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మలిసంధ్యలో ఆఫీసుల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగడం అత్యంత విచారకరమ న్నారు.స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డా రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి నేర్పుకోవాలని ఎద్దేవా చేశారు. టీచర్స్ డే రోజైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే ఉపాధ్యాయ లోకానికి ఇచ్చే నిజమైన గౌరవమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం

నాగర్ కర్నూల్ : రైతుల కరెంటు కట్ చేసి కష్టాలకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ సర్కార్ అధికారాన్ని కట్ చేసేందుకు రైతులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల అసమర్థ పాలనకు నిరసనగా నాగర్ కర్నూల్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు.స్థానిక వెలమ ఫంక్షన్ హాల్ నుంచి సబ్‌స్టేషన్ వరకు రైతులు, ట్రాక్టర్లతో భారీ నిరసన ర్యాలీ చేపట్టి హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్ద సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్తు , సకాలంలో విత్తనాలు, ఎరువులు, రైతుబంధు, ప్రభుత్వ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు వంటి బృహత్తర కార్యక్రమాలను రైతుల కోసం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఇచ్చిన వసతులు రేవంత్ రెడ్డి ఎందుకు ఇవ్వడని రైతులు ప్రశ్నిస్తున్నారన్నారు. తాము ఇంతకంటే గొప్పగా రేవంత్ రెడ్డి ఇస్తాడని నమ్మి మోసపోయామని రైతులు బాధపడుతున్నారని వెల్లడించారు. తెలంగాణ రైతుల పాలిట శనిగా కాంగ్రెస్ సర్కార్ మారిందని దుయ్యబట్టారు. రైతులకు నీరు ఇవ్వకపోతే ఏ తంటా ఉండబోదని గ్రాహించి కృష్ణ, గోదావరి నదులలో సమృద్ధిగా నీరు ఉన్న నీటిని ఎత్తిపోయడానికి చేసిన నిర్లక్ష్యమే నేడు తెలంగాణ రైతుల కొంప ముంచిందన్నారు.

3 నెలల ఉచిత బియ్యం పంపిణీ నేటితో ముగింపు

హైదరాబాద్ :రాష్ట్రంలో మూడు నెలల ఉచిత బియ్యం పంపిణీ ఇవాళ్టితో ముగియనుంది. అర్హులైన రేషన్ కార్డుదారులు సాయంత్రం వరకూ బియ్యం తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ సూచించింది. అయితే ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నత్తనడకన సాగుతోంది. ప్రింటింగ్ పూర్తయినా

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి నోచుకోవడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు.రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ నేటితో ముగియనుంది. దేశవ్యాప్తంగా గోదాముల్లో నిల్వలు పేరుకుపోవడం, సూపర్ ఎల్‌నినో కారణంగా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబరుకు సంబంధించి 3 నెలల రేషన్ బియ్యం ప్రభుత్వం ఒకేసారి పంపిణీ చేసింది. నెల రోజుల పాటు చౌక ధరల దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. అయితే సాంకేతిక సమ స్యలు, కార్డుదారుల గందరగోళం వల్ల డీలర్లపై తీవ్ర ఒత్తిడి పెరగడంతో అధికారులు పంపిణీ గడు వును 5 రోజులు పొడిగించారు. ఈ గడువు ఇవాళ సాయంత్రంతో ముగుస్తుంది. లబ్ధిదారులు సాయంత్రంలోగా బియ్యం తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ సూచించింది.నిత్యవసరాల 'చౌక' గా ఇవ్వండి : 3 నెలల కోటా ఒకేసారి ఇవ్వడం వల్ల బియ్యం నిల్వ ఉండి, పురుగులు పట్టే పాడైపో తున్నాయని లబ్ధిదారులు అంటున్నారు. నెలనెలా రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతు న్నారు. అయితే నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ప్రభుత్వం ఉప్పు, పప్పు, పంచదార, కారం, , గోధుమపిండి, వంట నూనె కూడా కోటాలోనే ఇవ్వాలని కోరుతున్నారు.

రాజ్యాంగం కల్పించిన ఆ స్వేచ్ఛ ఇక ముస్లింలకు వర్తించదా?

సహారన్‌పూర్ కలెక్టరేట్‌లో మసీదు కూల్చివేత రాజ్యాంగ మత స్వేచ్ఛపై ఓవైసీ ప్రశ్న 1911 నాటి రికార్డులు ఉన్నాయన్న ఓవైసీ కోర్టు ఆదేశాలతో కూల్చివేత చేపట్టిన అధికారులు ఘటనతో ఉత్తర్‌ప్రదేశ్‌లో రాజకీయ దుమారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పూర్ కలెక్టరేట్ ప్రాంగణంలోని మసీదు కూల్చివేతపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందించారు. ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ ఇక వర్తించదా? అని ప్రశ్నించారు. శనివారం తెల్లవారుజామున 5 గంటలకు మసీదును ఉనికిని నిరూపించే 1911 నాటి రికార్డులు కమిటీ వద్ద ఉన్నాయని ఓవైసీ చెప్పారు. శతాబ్దానికి పైగా అక్కడ ప్రార్థనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది 'వక్ఫ్ బై యూజర్' పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు.ఏళ్ల తరబడి అక్కడ ప్రార్థనలు జరుగుతున్నట్లు నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పుడు ఆ భూమిపై హక్కు ఎలా కోరుతుందని ఓవైసీ ప్రశ్నించారు. "మసీదు ముందే ఉంది..

కలెక్టరేట్ ఆ తర్వాత వచ్చింది" అని వ్యాఖ్యానించారు. మసీదును కూల్చేందుకు బుల్డోజర్ ఉపయోగించడాన్ని తప్పుబట్టారు. "నా మత స్వేచ్ఛ మీ దయపై ఆధారపడి లేదు" అని స్పష్టం చేశారు.కోర్టు ఆదేశాల మేరకే కూల్చివేత చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మసీదును ప్రభుత్వ భూమిపై ఉన్న అక్రమ నిర్మాణంగా కోర్టు గతంలో ప్రకటించింది. ముస్లిం పక్షం దాఖలు చేసిన అప్పీలును జిల్లా న్యాయస్థానం శుక్రవారం తిరస్కరించింది. దీంతో శనివారం భారీ భద్రత మధ్య కూల్చివేత చేపట్టారు. ఈ ఘటనపై రాజకీయంగా దుమారం రేగింది. సహారన్‌పూర్ వెళ్లేందుకు సిద్ధమైన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్‌ను పోలీసులు ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారని ఆమె వర్గం తెలిపింది. ఆమె నివాసం వద్ద భారీగా బలగాలను మోహరించారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ కూడా కూల్చివేతను తప్పుబట్టారు. భూమి రికార్డులు, వక్ఫ్ బోర్డు అంశాలను ఆయన ప్రస్తావించారు. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ఈ పరిణామంతో పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.

సీఎంతో చర్చలు ఫలప్రదంగా ముగుస్తాయని ఆశిస్తున్నాం

అమరావతి, సెప్టెంబర్ 5: ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల ప్రతినిధిలు భేటీకానున్నాయి. ఇందులో భాగంగా (శనివారం) ఉదయం ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సీఎం వద్ద తమ సమస్యలు అన్నింటినీ ప్రస్తావిస్తామని చెప్పారు. సీఎంతో చర్చలు ఫలప్రదంగా ముగుస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.సీఎంతో సానుకూలమైన ఫలితాలు వస్తాయని అనుకుంటున్నామని విద్యాసాగర్ తెలిపారు. ప్రభుత్వంతో చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి తప్ప ఆందోళన వల్ల ఏం సాధించలేమని చెప్పారు. గతంలో జీవోఎంతో ఆరు గంటల పాటు చర్చలు జరిపామని.. ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం చేయాలని కోరుతున్నామని అన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిచినందున రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని వాయిదా వేసుకుని మరీ వచ్చినట్లు వెల్లడించారు. చర్చల్లో సానుకూల ఫలితాలు వస్తాయని భావిస్తున్నామని విద్యాసాగర్ పేర్కొన్నారు.

మన దృష్టి ఆ పిల్లల సంక్షేమంపైనే ఉండాలి

అమరావతి, సెప్టెంబర్ 5: చట్టంతో వైరుధ్యం ఉన్న పిల్లవాడైనా.. రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లవాడైనా.. మన దృష్టి ఎల్లప్పుడూ ఆ పిల్లల సంక్షేమం పైనే ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ అన్నారు. అవసరాన్ని బట్టి అమల్లోకి తెచ్చిన వివిధ సవరణలు, సంస్కరణలు మన దేశంలోని పిల్లల హక్కులు, ఆత్మగౌరవం, భవిష్యత్‌ను పరిరక్షించడానికి ఒక బలమైన పునాదిని అందించాయని పేర్కొన్నారు. పిల్లలు సామాజిక నిర్లక్ష్యానికి, పేదరికానికి బాధితులుగా మారుతుంటారని, పిల్లలలో సహజంగానే ఒక ప్రత్యేకమైన సున్నితత్వం ఉంటుందని ఆమె అన్నారు.శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ.. 'వివిధ జువైనల్ జస్టిస్ బోర్డులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, చైల్డ్ ప్రొటెక్షన్ సొసైటీలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్లు అన్ని జిల్లాల్లోని ప్రత్యేక చైల్డ్ కేర్ హోమ్‌ల ఏర్పాటు, పనితీరు గురించి మాట్లాడుకుంటాం. చట్టం లక్ష్యాలు, ఉద్దేశాలకు అనుగుణంగా పిల్లలకు అనుకూలమైన విధానాలను అవలంబించడం గురించి మాట్లాడుతాం. ఇది పునరావాస న్యాయం, సంస్థాగత జవాబుదారీతనంపై ఆధారపడి ఉంటుంది. మన దత్తత ప్రక్రియలను సరళీకృతం చేశామని కూడా గర్వంగా చెప్పుకుంటాం'.'నిజానికి ఈ రోజు ఇక్కడ చేరిన మనమందరం మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. మన ప్రయత్నాలలో మనం ఎంతవరకు విజయం సాధించాం? చట్టంతో వైరుధ్యం ఉన్న పిల్లల సంఖ్య తగ్గిందా? సంరక్షణ, రక్షణ అవసరమైన పిల్లల సంఖ్యలో తగ్గుదల ఉందా? వారి జీవితాలను తిరిగి నిర్మించుకోవడానికి తగిన సౌకర్యాలను మనం వారికి అందించగలుగుతున్నామా? మన అబ్జర్వేషన్ హోమ్‌లు, స్పెషల్ హోమ్‌లు, భద్రతా కేంద్రాలు అని పిలవబడే ప్రదేశాలలో సౌకర్యాలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? మనం మన పిల్లలను సరిగ్గా కాపాడు కోగలుగుతున్నామా?'..'నిజానికి ఈ పిల్లలే మన దేశపు భవిష్యత్. మన భవిష్యత్ ఈ పిల్లల భద్రతపైనే ఆధారపడి ఉంది. మనం చాలా దూరం వచ్చాం. కానీ, ఇక్కడ కూర్చున్న మనలో ప్రతి ఒక్కరికీ మన వ్యవస్థలో ఉన్న స్పష్టమైన, నిలకడలేని లోపాల గురించి బాగా తెలుసు. ఆ లోపాలు మన కళ్లముందే స్పష్టంగా కనిపిస్తున్నాయి. నా దగ్గర పూర్తి గణాంకాలు, వివరాలు ఉన్నప్పటికీ, ఈ సమయంలో నేను ఆ వివరాల్లోకి వెళ్లడం లేదు. నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరతతో మనం ఇబ్బంది పడుతున్నాం'..'పిల్లలకు అనుకూలమైన విధానాలను అమలు చేయడంలో స్థిరత్వం లేకపోవడం, మనందరిలోనూ ఒక రకమైన నిర్లక్ష్యం, మూస ధోరణి కనిపిస్తాయి. మనం ఎదుర్కొంటున్న మరొక పెద్ద సవాలు డిజిటల్ ప్రపంచం నుంచి వస్తోంది. సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ బాల లైంగిక వేధింపులు, పిల్లలకు అందుబాటులో ఉన్న అపరిమితమైనడిజిటల్ ఎక్స్‌పోజర్ ఇవన్నీ మనం తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలు. మనం మౌనంగా ప్రేక్షకులుగా ఉండిపోలేం. మన పిల్లలను కాపాడుకోవడానికి లా ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టపరమైన, మానసిక మద్దతు వేగంగా అభివృద్ధి చెందాలి. కేవలం చర్చలు జరిపి, వాటిని ముందుకు తీసుకెళ్లకుండా వదిలేసే వెసులుబాటు మనకు లేదు' అని తెలిపారు.

రాష్ట్రంలో ఇంకా ప్రారంభం కానీ డిగ్రీ కళాశాలలు – పూర్తికానీ కౌన్సెలింగ్ ప్రక్రియ

అమరావతి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదలై నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ జరగలేదు. డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకున్న విద్యార్థులు గత 140 రోజులుగా ఎదురుచూడాల్సి వస్తోంది. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ రెండు విడతలు పూర్తయి తరగతులు ప్రారంభమయ్యాయి. కానీ డిగ్రీ ప్రవేశాల సీట్ల కేటాయింపును ఉన్నత విద్య కమిషనరేట్ తరచూ వాయిదా వేస్తోంది. కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు కళాశాలలను ఒక చోటు నుంచి మరో చోటుకు మార్చుకునేందుకు అవకాశం కల్పించేందుకే ఈ జాప్యం చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిగ్రీలో అన్ని కోటాలు కలిపి ఏటా 1.79 లక్షల మంది వరకు ప్రవేశాలు పొందుతున్నారు.సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల లభ్యత తక్కువగా ఉండడం: బీఎస్సీ, బీకాం, బీసీఏ లాంటి కోర్సులతో ఉద్యోగాలు లభిస్తున్నందున వాటిల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ప్రవేశాల ఆలస్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్ల భర్తీపైనా ప్రభావం చూపుతోంది. ఇంటర్మీడియట్ ఫలితాలకు డిగ్రీ ప్రవేశాలకు మధ్య ఉన్న విరామ సమయంలో ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి.తరచూ మారుస్తూ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు ఏప్రిల్ 15న విడుదలయ్యాయి. డిగ్రీ ప్రవేశాలకు ఆగస్టు 4న ఉన్నత విద్య కమిషనరేట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 26న సీట్ల కేటాయింపు పూర్తి చేసి, 27 నుంచి తరగతులు ప్రారంభించాలి. కానీ సీట్ల కేటాయింపును ఈ నెల 2కు వాయిదా వేశారు. ఇప్పుడు తాజాగా ఏడో తేదీకి వాయిదా పడింది. మొదటి విడత ముగిసిన తర్వాత రెండో విడత, స్పాట్, యాజమాన్య కోటా సీట్ల భర్తీ ప్రక్రియ ఉంటుంది. ఇవన్నీ పూర్తయ్యేందుకు మరో 10 రోజులకు పైగా సమయం పడుతుంది. సెప్టెంబరు మధ్యలో తరగతులు ప్రారంభమైతే విద్యా సంవత్సరం పూర్తయ్యేందుకు ఇబ్బందులు వస్తాయని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ప్రవేశాలు ఆలస్యం కాకుండా: సకాలంలో తరగతులు ప్రారంభించాలనే ఉద్దేశంతో పది, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను వేగంగా ఇస్తున్నారు. ప్రణాళిక ప్రకారం ప్రవేశాలు మాత్రం ముగియడం లేదు. మూడేళ్ల డిగ్రీలో చివరి ఏడాది మొత్తం అప్రెంటిస్‌షిప్ ఉండేలా కోర్సులను ఉన్నత విద్యా మండలి రూపొందించింది. వీటిని ఈ ఏడాది నుంచి అమలు చేసేందుకు ప్రతిపాదనలను ఉన్నత తిరస్కరించింది. ఈ కోర్సుల కోసం కళాశాలల నుంచి అంగీకారం తీసుకుని, కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఆలస్యమవుతుందంటూ ప్రతిపాదనలను పక్కన పెట్టేసింది. అటు అప్రెంటిస్‌షిప్ డిగ్రీలు ప్రవేశ పెట్టకపోగా ఇటు కౌన్సెలింగ్‌లోనూ జాప్యమే జరిగింది.

కర్నూలులో రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన

కర్నూలు, సెప్టెంబరు 5: జిల్లాలోని మార్కెట్ యార్డులో రూ. 50 లక్షల వ్యయంతో చేపడుతున్న షెడ్ నిర్మాణానికి మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేశారు. వీటితో పాటు జిల్లాలో మొత్తం రూ. 2 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడా రు. రైతుల సౌకర్యార్థం జిల్లా మార్కెట్ యార్డులో నూతన షెడ్ నిర్మాణాన్ని చేపట్టినట్టు మంత్రి తెలిపారు. దీంతో పాటు రానున్న రోజుల్లో యార్డులో 30 నుంచి 40 వరకు కొత్త షాపులు నిర్మించేందు కు ప్రణాళికలు రూపొందిస్తు న్నామని ఆయన వెల్లడించారు. రైతుల కృషి వల్లే ఈ ఏడాది మార్కెట్ యార్డు ఆదాయం రూ. 8 కోట్లకు పెరిగిందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.గతంలో ఉల్లిధరలు పడిపోయిన సమయంలో సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి రైతులకు అండగా నిలిచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కర్నూలు నగరంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి భరత్ అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతున్నారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు.

ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రు డు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతం గా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటి ంచారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశం తోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు.మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మేం సిద్ధం.. స్థానిక పోరు నుంచి చంద్రబాబులా పారిపోం

అమరావతి: స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామన్న గుడివాడ అమర్నాథ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి కూటమి పార్టీలు వణుకుతున్నాయని ఎద్దేవా ఎన్నికల నుంచి తప్పించుకునేందుకు దిగజారుడు యత్నాలు చేస్తున్నారని విమర్శత్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ కచ్చితంగా పోటీ చేసి తీరుతుందని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. తమ అధినేత జగన్ ఎప్పుడూ ఎన్నికల బరి నుంచి తప్పించుకునే నాయకుడు కాదని అన్నారు. వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికలు నిర్వహించినప్పుడు చంద్రబాబు భయపడి పారిపోయారని ఎద్దేవా చేసిన ఆయన, ప్రజాస్వామ్యంలో గెలుపోటములను ప్రజల తీర్పు ద్వారానే తేల్చుకోవాల్సి ఉంటుందన్నారు. స్థానిక పోరును ఎదుర్కొనేందుకు తమ పార్టీ అన్ని విధాలా సమరసన్నాహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు.తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా ఒక్కటైనప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు వణుకుతున్నాయని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. అధికార బలాన్ని ఉపయోగించి స్థానిక సమరాన్ని వాయిదా వేసేందుకు, ఎన్నికల నుంచి తప్పించుకునేందుకు కూటమి నేతలు దిగజారుడు యత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల విఫలంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని, ఈ స్థానిక ఎన్నికల ఫలితాలతో తమ అసలు రంగు బయటపడుతుందనే భయంతోనే కూటమి నాయకులు జంకుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

పోలవరం నుంచి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు.. చంద్రబాబు చేతుల మీదుగా విడుదల

తిరుపతి జిల్లా: తిరుపతి జిల్లాలోని సతీశ్? ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌రి సరికొత్త రికార్డు సృష్టించింది. శుక్రవారం తెల్లవారుజామున శ్రీహరికోట నుంచి ప్రయోగించిన జీఎస్ఎల్వీ–ఎఫ్–17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ రాకెట్ ద్వారా ఈవోఎస్–05 అనే అత్యాధునిక భూపరిశీలన ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపారు. జీఎస్ఎల్వీ రాకెట్ మోసుకెళ్లిన అత్యంత బరువైన ఉపగ్రహం (2,367 కిలోలు) ఇదే కావడం విశేషం. ఇది భూమికి దాదాపు 31,026 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలో స్థిరపడి దేశంలో వచ్చే తుపాన్లు, వరదలు, అడవుల్లో మంటలు వంటి ప్రకృతి వైపరీత్యాలను ఎప్పటికప్పుడు ముందే పసిగట్టి, స్పష్టమైన సమాచారాన్ని అందిస్తుంది.శు క్రవారం తెల్లవారుజామున చేపట్టిన ఇస్రో జీఎస్ఎల్వీ ఎఫ్–17 ప్రయోగం విజయవంతమైంది. ఇది 2,367 కిలోల బరువున్న అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహాన్ని అత్యంత కచ్చితత్వంతో నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. వాతావరణం సవాలుగా మారినప్పటికీ, వరుణ దేవుడు ఆశీర్వదించినట్లుగా అనిపించింది. శ్రీహరికోటలో తెల్లవారుజాము 2 గంటల నుంచే వర్షం కురుస్తోంది. ప్రయోగ సమయంలో వర్షం కాస్త తగ్గినప్పటికీ, రాకెట్ నుంచి ఉపగ్రహం వేరుపడిన తర్వాత మళ్లీ తీవ్రమైంది. ఏమాత్రం వెనకడుగు వేయకుండా ప్రయోగ వీక్షణ గ్యాలరీలోని సుమారు 1,000 నుంచి 1,500 మంది సందర్శకులు వర్షంలో తడుస్తూనే ఈ అద్భుత దృశ్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.చేదు జ్ఞాపకాలను చెరిపివేస్తూ : గత వైఫల్యాల చేదు జ్ఞాపకాలను సమర్థవంతంగా చెరిపివేస్తూ ఇస్రో శాస్త్రవేత్తలు ఈ మిషన్‌ను అద్భుతమైన కచ్చితత్వంతో నిర్వహించారు. ఈ ఏడాది జూలైలో షార్ కేంద్రం నుంచి స్కైరూట్ సంస్థకు చెందిన ప్రైవేట్ ప్రయోగం (విక్రమ్–1) జరిగినప్పటికీ ఈ ఏడాదిలో ఇస్రో చేపట్టిన పూర్తి స్థాయి విజయవంతమైన ప్రయోగం ఇదే కావడం విశేషం.మిషన్?కు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి :మిషన్ పేరు: జీఎస్ఎల్వీ ఎఫ్–17 / ఈఓఎస్?–05డేట్? అండ్? టైం: 2026, సెప్టెంబర్ 4, తెల్లవారుజామున 2:55 గంటలకురాకెట్ పొడవు: 51.7 మీటర్లు. మొత్తం బరువు: 420.5 టన్నులు.దశలు: మొత్తం 3 దశలు.ఉపగ్రహం బరువు: 2,367 కిలోలు.ఉపగ్రహం ప్రత్యేకత: ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి హైపర్‌స్పెక్ట్రల్ జియోస్టేషనరీ (భూ–స్థిర) ఉపగ్రహం. అలాగే ఇది అత్యాధునిక భూ పరిశీలన అంతరిక్ష నౌక.లక్ష్య కక్ష్య: సబ్–జీటీఓ. దీని పెరీజీ (భూమికి అత్యంత దగ్గరి దూరం) 170 కి.మీ, అపోజీ (భూమికి అత్యంత దూరపు దూరం) 28,934 కి.మీ.అంచనాలకు మించి: ఉపగ్రహాన్ని 29,000 కి.మీ ఎత్తులో ఉన్న సబ్–జీటీఓ కక్ష్యలో ఉంచడం లక్ష్యం. జీఎస్?ఎల్?వీ అద్భుత పనితీరు కారణంగా, ఇది 31,026 కి.మీ ఎత్తును చేరుకుంది.రికార్డులు: జీఎస్?ఎల్?వీ ఇది 19వ ప్రయోగం ఇది ఇస్రో చేపట్టిన 103వ కక్ష్య మిషన్

విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

నెల్లూరు, సెప్టెంబర్ :

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిపై తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విజయసాయిరెడ్డిని కొట్టింది నిజ మేనని తెలిపారు. మంగళగిరిలో ప్లీనరీ జరిగేట ప్పుడు రెస్ట్ రూమ్‌లో వేదికపై ఎవరితో మాట్లాడి ంచాలనే విషయంపై వీరిద్దరి మధ్య వివాదం తలెత్తి, మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ఆ విషయం చాలామంది నేతలకు తెలుసునని అన్నారు. విజయసాయికి వైసీపీలో 72 అవమానాలు జరిగాయని చెప్పారు. ఆయన నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేసినప్పుడు ఎంత నీచంగా, ఘోరంగా మాట్లాడారో అందరికీ తెలుసునని పేర్కొన్నారు.(మంగళవారం) నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్య టించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఒక్కడికే తెలిసి మరో ఘోర అవమానం జరిగిందని అన్నారు. విజయసాయి తన సొంతూరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు, కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో ఘనంగా స్వాగతం పలికారని వెల్లడించారు. దానిపై విజయసాయిని సజ్జల దారుణంగా దూషించారని చెప్పుకొచ్చారు. ఆ మాటలు చెప్పలేని విధంగా ఉన్నాయని అన్నారు.

Printed, Published & Owned by Rachakonda Printers & Publication's at P. Mahesh Goud Office address :-Dwaraka nagarRoad no:6 Plot : 101500079 RR dist, Hyderabad TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H. No:- 5-2-396 Venkateshwara colony Saheb nagar Rangareddy 500070 TELANGANA STATE. EDITOR : P. Mahesh Goud 9908 502 602 , PRGI NO:- TGTEL/26/A6429. EMAIL: youvavelugu@gmail.com https://epaper.yuvavelugu.com